"గుళ్లో లింగం" అన్నాడు మరిది.

చూచి చూచి కళ్లు చిల్లులు పడుతున్నై సిద్ధమ్మకి.

సిద్ధమ్మకి కళ్ళల్లో నీళ్ళు తిరిగినై.

రైల్లో గుడ్డివాళ్ళు పాడుకునే పాట జ్ఞాపకం వచ్చింది.

'ఎంత పని చేసితివి రామా...

నిన్నేమనందును, సార్వభౌమా...'

"అదుగో" అన్నాడు మరిది.

"ఏమిటి!" అడిగింది సిద్ధమ్మ.

"కొండమీద దీపం" అన్నాడు మరిది.

సిద్ధమ్మ రివ్వున కొండ వైపుకు తిప్పింది తల.

నిజంగా కొండమీద దీపం! సిద్ధమ్మకి ఈ తడవ యే పాటా జ్ఞాపకం రాలా.

"ఓ మరిదీ?" అన్నది సిద్ధమ్మ.

"ఏం వదినా!" అడిగాడు మరిది.

"ఎందుకు దీపం అటూ యిటూ ఊపుతాడు?" అడిగింది సిద్ధమ్మ.

"వస్తున్నా, వొస్తున్నా అనేగుర్తుకి" అన్నాడు మరిది.

"ముండనష్టపాడు! అన్నది సిద్ధమ్మ మురిపెంగా.

చటుక్కున కొండలమధ్య తుపాకి పేలింది సిద్ధమ్మ గుండె గుభేలుమన్నది.

"ఉంజ్ఞ, ఉంజ్ఞ" అన్నాడు. పిల్లవాడు.

కుంది.

"మరిదీ, మరిదీ" అన్నది సిద్ధమ్మ.

"ఏం వదినా?" అన్నాడు మరిది.

"కొండమీద దీపం" అన్నది సిద్ధమ్మ.

"ఆరిపోయింది!" అన్నాడు మరిది.

"మరి సీనడో?" అంది సిద్ధమ్మ.

"ఉంజ్ఞ, ఉంజ్ఞ" అన్నాడు పిల్లవాడు.

మళ్ళీ కొండలమధ్య తుపాకీ పేలింది. మరిది ఉప్పెనకుమల్లే రివ్వున వెళ్లాడు కొండమీదికి. సిద్ధమ్మకి అంతా అయోమయంగా వుంది. గుడ్లు అప్పజెప్పి చూస్తూ నుంచుంది.

"ఉంజ్ఞ, ఉంజ్ఞ" అన్నాడు పిల్లవాడు.

"ఉండరా" అన్నది సిద్ధమ్మ.

అత్తమామలు ఎవరికళ్ళు వాళ్ళు నులుముకుంటూ వొచ్చారు. మామకి సిద్ధమ్మని పలకరించటానికి భయం వేసింది.

అందుకని వెంకమ్మని పలకరించాడు.

"వెంకమ్మా?" అన్నాడు వెంకయ్య.

"ఏంది ముసలాయనా?"

"మరి గత్తే..." అన్నాడు వెంకయ్య,

"అడుక్కో" అంది వెంకమ్మ.

"ఆ మోత ఎక్కడిదీ అంట!"

